స్నాక్స్‌కు నిధుల విడుదల

- పదో తరగతి విద్యార్థులకు రూ.15 చొప్పున మంజూరు
- హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు



చదువుకుంటున్న పదో తరగతి విద్యార్థులు

మహబూబాబాద్ అర్బన్: పదో తరగతి విద్యార్థుల్లో ఉత్తీర్ణత శాతం పెంచి మెరుగైన ఫలితాలు సాధించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిరోజూ ఉదయం 8:30గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తోంది. ఈ సమయంలో విద్యార్థులకు స్నాక్స్ అందజేయాలనే ఆలోచనతో శనివారం నిధులు విడుదల చేసింది. ఈ మేరకు విద్యార్థులకు ప్రవేశపెట్టిన అల్పాహారం (స్నాక్స్) అందజేత ప్రత్యేక పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలని విద్యాశాఖ ఉత్తర్వులను జారీ చేసింది. ఒక్కో విద్యార్థికి రూ. 15 చొప్పున నిధులు మంజూరు చేసింది. ఫిబ్రవరి 15వ తేదీ నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు స్నాక్స్‌ను విద్యార్థులకు అందజేస్తారు. ఈ నిధులు మేనేజ్‌మెంట్ కమిటీ ఖాతాలకు జమ చేస్తారు. మధ్యాహ్న భోజన ఏజెన్సీల ద్వారా స్నాక్స్ అందజేయాలని రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జిల్లాలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు 109 ఉండగా వాటిల్లో పదో తరగతి విద్యార్థులు 4,089 మంది చదువుతున్నారు. వీరికి ఉదయం, సాయంత్రం అల్పాహారం అందించడానికి రూ.20,59,890 నిధులు మంజూరు అయినట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు తెలిపారు.

ఉపాధ్యాయ సంఘాల హర్షం

ప్రభుత్వ నిర్ణయాన్ని పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు స్వాగతిస్తున్నారు. విద్యార్థులకు స్నాక్స్ అందజేతకు నిధుల విడుదలపై పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు సంకా బద్రినారాయణ, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చుంచు శ్రీశైలం, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు భాస్కర్, హెచ్‌ఎం అసోసియేషన్ అధ్యక్షుడు లచ్చిరాం హర్షం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ నిర్ణయం బాగుంది..



ఒకపూట పస్తులు ఉండి బడికి పోతున్న పిల్లల గురించి ప్రభుత్వం ఆలోచన చేసి ఉదయం, సాయంత్రం వేళల్లో అల్పాహారానికి డబ్బులు విడుదల చేయడం బాగుంది. చదువుపై మరింత శ్రద్ధ పెరిగి చదువులో ఉన్నతంగా రాణిస్తారు.

\- పి.కవిత, విద్యార్థి తల్లి

ఆనందంగా ఉంది..



అమ్మ నాన్నా ఉదయం పనికి వెళ్తారు. అప్పుడు నేను స్కూల్ టైం అవుతుందని పరిగడుపుతోనే వస్తాను. స్కూల్లో చదువుకుంటుంటే పొద్దునే ఆకలి అవుతుంది. ప్రభుత్వం విద్యార్థుల ఆకలిని గుర్తించి అల్పాహారానికి నిధులు మంజూరు చేయడం ఆనందంగా ఉంది.

\- అజయ్, విద్యార్థి, ప్రభుత్వ పాఠశాల, మానుకోట

క్లుప్తంగా

అటవీ సంరక్షణ నియమాలను ఉపసంహరించుకోవాలి



గార్ల: అడవులను కార్పొరేట్ సంస్థలకు దారాదత్తం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అటవీ సంరక్షణ 2022 నియమాలను వెంటనే ఉపసంహరించుకోవాలని ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.సక్రు డిమాండ్ చేశారు. శనివారం గార్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 13న జిల్లా కేంద్రంలో చేపట్టే ప్రదర్శనలో ఆదివాసీ గిరిజన పోడు రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల నాయకులు మనోహర్, మాన్యా, కృష్ణ, రాములు, సీహెచ్ గణేష్, మంగీలాల్, ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

కాల్వలకు శాశ్వత నిర్మాణాలు చేపట్టాలి

బయ్యారం: బయ్యారం పెద్దచెరువు కాల్వలకు శాశ్వత నిర్మాణాలు చేపట్టి ఆయకట్టు పరిధిలోని రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం రాష్ట్ర నాయకులు జగ్గన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం బయ్యారంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చెరువు కాల్వలు సరిగా లేకపోవటంతో ప్రతి వర్షాకాలంలో నీరు సరిగా ప్రవహించక ఆయకట్టు పరిధిలోని రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. చెరువు కాల్వలకు మరమ్మతులు నిర్వహిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన పాలకులు కాల్వలోని పూడిక తీస్తున్నారే తప్ప ఎలాంటి నిర్మాణాలు చేపట్టడం లేదని ఆయన పేర్కొన్నారు.

బీఎస్పీ డోర్నకల్ అసెంబ్లీ అధ్యక్షుడిగా శేఖర్‌నాయక్



మరిపెడ రూరల్: బీఎస్పీ డోర్నకల్ నియోజకవర్గ అసెంబ్లీ నూతన అధ్యక్షుడిగా మండలంలోని గుర్రప్పతండా గ్రామ పంచాయతీకి చెందిన బానోతు శేఖర్ నాయక్‌ను నియమించినట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు తేజావత్ అభినాయక్ శనివారం తెలిపారు.

నేడు ధ్యానమందిరం ప్రారంభం

చిన్నగూడూరు: మండలంలోని జయ్యారం గ్రామంలో కొత్తగా నిర్మించిన ధ్యానమందిరాన్ని నేడు ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజేంద్రప్రసాద్(ఐపీఎస్), ఎస్.గిరిప్రసాద్(ఏసీపీ) హాజరుకానున్నారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని నిర్వాహకులు కోరారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



తొర్రూరు రూరల్: మండలంలోని వెంకటాపురం గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన గుండాల ఐలయ్య కుటుంబానికి సేవా ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో రూ.20వేల ఆర్థిక సాయం శనివారం అందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు కొండ యాకన్న, సభ్యులు విజయ్, వెంకన్న, రంజీత్, వెంకట్, ఐలయ్య, రామయ్య, అరేందర్ పాల్గొన్నారు.

‘రేవంత్‌రెడ్డిని విమర్శించే స్థాయి లేదు’



మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

తొర్రూరు రూరల్: రేవంత్‌రెడ్డిని విమర్శించే స్థాయి మంత్రి ఎర్రబెల్లికి లేదని టీపీసీసీ సభ్యుడు లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని చింతలపల్లిలో శనివారం కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జక్కుల రాంరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో లక్ష్మీనారాయణ మాట్లాడారు. జాతీయ పార్టీకి అధ్యక్షుడిగా ఉన్న వ్యక్తిపై ఎమ్మెల్యే స్థాయి వ్యక్తి విమర్శలు చేయడం హాస్యాస్పదమన్నారు. త్వరలో పాలకుర్తి నియోజకవర్గంలో రేవంత్‌రెడ్డి పాదయాత్ర జరగనుందని, ఎర్రబెల్లికి చెమటలు పట్టడం ఖాయమన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హామ్యానాయక్, నాయకులు మాచర్ల ప్రభాకర్, పెద్ది కృష్ణమూర్తి, కందాడి అశోక్ రెడ్డి, మేకల కుమార్, సంతోష్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీపీతోనే పేదలకు న్యాయం



మాట్లాడుతున్న యాకేందర్‌గౌడ్

తొర్రూరు: వైఎస్సార్‌టీపీతోనే పేదలకు న్యాయం జరగనుందని పార్టీ జిల్లా నాయకుడు పంజాల యాకేందర్‌గౌడ్ అన్నారు. శనివారం డివిజన్ కేంద్రంలో వైఎస్సార్ టీపీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. యాకేందర్‌గౌడ్ మాట్లాడుతూ.. వైఎస్సార్ టీపీ అధినేత్రి షర్మిల నాయకత్వంలో రాష్ట్రంలో మహానేత రాజశేఖరరెడ్డి సంక్షేమ పాలన రానుందని తెలిపారు. యాత్రకు రాష్ట్ర ప్రభుత్వం అడ్డంకులు సృష్టించడం సరికాదన్నారు. కార్యక్రమంలో నాయకులు సాయి, కిరణ్, సతీష్, సాయిచరణ్, హరీశ్, శ్రీనాథ్, వెంకన్న పాల్గొన్నారు.

నేటినుంచి ప్రత్యేక పూజలు



ముస్తాబైన ఆలయం



రథంపై బయలుదేరిన వేంకటేశ్వరస్వామి

గార్ల: గార్ల మండలం మర్రిగూడెం వేట వేంకటేశ్వర స్వామి ప్రాకార మండపం ముఖద్వారం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. నేటి నుంచి ఈనెల 15 వరకు వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు కొనసాగనున్నట్లు అర్చకులు మధుస్వామి శనివారం తెలిపారు. గార్ల మండలం రాంపురం గ్రామానికి చెందిన పులి గోపాల్‌రెడ్డి, ప్రమీల దంపతులు వేంకటేశ్వరస్వామి దేవాలయం అభివృద్ధి కోసం రూ.కోటి 5లక్షలు విరాళంగా ఇచ్చిన విషయం విదితమే. దీంతో ప్రాకార మండపం నిర్మాణం పనులు శనివారంతో పూర్తయ్యాయి. నేడు స్వామివారికి శ్రీ విష్వక్సేన ఆరాధన, వాసుదేవ పుణ్యాహవాచనం, రక్షాబంధనం, అంకురార్పణం, 13న అగ్రిమధనం యజ్ఞం, నవకలశాభిషేకము, 14న ఫల పుష్పధాన్య శేయ్యాధివాసము, 15న మహాసంప్రోక్షణం, ప్రాకార మండపం ముఖ ద్వారం దాతలచే ప్రారంభించిన అనంతరం స్వామివారి కల్యాణ మహోత్సవం జరుపనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ బి.అమర్‌చంద్ తెలిపారు. ప్రాకర మండపం ముఖద్వారం ప్రారంభం, కల్యాణ మహోత్సవం కోసం శనివారం గార్ల నుంచి ప్రత్యేకంగా పూలమాలలతో అలంకరించిన రథంపై వేంకటేశ్వర స్వామి సమేత శ్రీదేవి, భూదేవి ఉత్సవ విగ్రహాలు మేళతాళాల నడుమ పురవీధుల్లో ఊరేగుతూ మర్రిగూడెం దేవాలయానికి బయలుదేరారు. కార్యక్రమంలో సర్పంచ్ అజ్మీర బన్సీలాల్, పుల్లఖండం రమేష్‌బాబు, రాములు, కుటుంబరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కోతలు ఎత్తివేయాలని ధర్నా



ధర్నా చేస్తున్న రైతులు

నెల్లికుదురు: వేళా పాలా లేకుండా విధిస్తున్న విద్యుత్ కోతలను ఎత్తివేసి రైతులు సాగు చేసిన పంటలను కాపాడాలని మండలంలోని మేచరాజుపల్లి, ఎర్రబెల్లిగూడెం గ్రామ రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు మండలంలోని ఎర్రబెల్లిగూడెం విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట శనివారం రైతులు ధర్నా నిర్వహించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు వెంకన్న, జిలాని, కాంత్రికుమార్, వెంకటేశ్వర్లు, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల భూములు తీసుకోవడం సరికాదు



నెహ్రూ సెంటర్: బాధితులతో మాట్లాడుతున్న రాధా

నెహ్రూసెంటర్: గిరిజనుల భూములను ప్రభుత్వ తీసుకోవడం సరికాదని మహిళా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు నూనావత్ రాధా అన్నారు. జిల్లా కేంద్రంలోని నూతన కలెక్టరేట్ సమీపంలో గిరిజనుల ఇళ్లు కూల్చిన ప్రాంతాన్ని శనివారం పరిశీలించి గిరిజన కుటుంబాలను పరామర్శించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సాలార్‌తండాకు చెందిన గిరిజన భూములను లాక్కోవడం ఉపసంహరించుకోవాలన్నారు. ఇప్పటికైన జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గిరిజనులకు న్యాయం చేయాలని కోరారు. గిరిజనుల భూముల విషయాన్ని టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డికి తెలియజేశామని రాధా తెలిపారు. కార్యక్రమంలో బాధితులు రామ్మూర్తి, రవి, సిరి, సాల్యా, అర్జున్, అనిత, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన భూముల జోలికివస్తే ఊరుకోం..

మరిపెడ రూరల్: గిరిజనుల భూముల జోలికివస్తే సహించేది లేదని బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) జిల్లా అధ్యక్షుడు తేజావత్ అభినాయక్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మరిపెడ మండలం గుర్రప్పతండా గ్రామ పంచాయతీలో బీఎస్పీ గ్రామస్థాయి సమావేశం గ్రామ పార్టీ అధ్యక్షుడు గుగులోతు విజయ్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈసమావేశానికి ముఖ్యఅతిథులుగా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అభినాయక్, ఐనాల పరశురాములు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లాలో గిరిజన ఎంపీ, ఎమ్మెల్యే ఉండి కూడా నూతన కలెక్టరేట్ భవనం వద్ద అధికారులు గిరిజన భూములు లాక్కోవడం దారుణమన్నారు. ఈసమావేశంలో నాయకులు శేఖర్, కృష్ణమూర్తి, భారతి, కిరణ్, రాందాస్, ప్రవీణ్, సుధీర్ పాల్గొన్నారు.

న్యాయం చేయాలని వినతి

మహబూబాబాద్: జిల్లా కేంద్రం శివారు సాలార్ తండాకు చెందిన రామ్మూర్తి, రవి, సిరి కమ్లీ తమ భూములను ప్రభుత్వ కార్యాలయాలు ఇతరత్రా వాటి పేరుతో లాక్కోవద్దని శనివారం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. సబ్‌స్టేషన్ నిర్మాణం పేరుతో ఈవీఎం గోదాం వెనుక ఉన్న గిరిజనుల భూమిని లాక్కునే కుట్రలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం ఖననం

డోర్నకల్: స్థానిక మున్నేరువాగు సమీపంలో గుర్తించిన మృతదేహాన్ని శనివారం ఘటనా స్థలంలోనే పోలీసులు ఖననం చేశారు. డోర్నకల్ సమీపంలోని మున్నేరువాగు ప్రక్కన శుక్రవారం గుర్తు తెలియని, కుళ్లిన స్థితిలో ఉన్న 40సంవత్సరాలకు పైగా ఉన్న పురుషుడి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. ఘటనా స్థలంలో ఎలాంటి ఆధారాలు లభించకపోవడం, పోస్టుమార్టానికి తరలించడానికి వీలు లేనంతగా మృతదేహం కుళ్లిపోవడంతో శనివారం డోర్నకల్ పోలీసులు మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రి నుంచి వైద్యులను రప్పించి వారిచే ఘటనా స్థలంలోనే పోస్టుమార్టం నిర్వహించారు. పోస్టుమార్టం అనంతరం ఘటనా స్థలంలోనే మృతదేహాన్ని పూడ్చారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై శ్యాంసుందర్ తెలిపారు.

అవినీతిపై పోరాటం ఆగదు

నర్సింహులపేట: కేసీఆర్ అవినీతిపై బీజేపీ పోరాటం ఆగదని నియోజకవర్గ ప్రభారీ ఈవీ రమేష్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో కుటుంబ పాలన నడుస్తుందని నీళ్లు, నిధులు, నియామకాలు కేసీఆర్ కుటుంబానికే వచ్చాయన్నారు. తెలంగాణలో ఉద్యోగం కంటే వృద్ధాప్యమే ముందు వస్తుందన్నారు. జీపీలకు వచ్చే నిధులన్నీ కేంద్రం నుంచే వస్తుందని, నిరుద్యోగ భృతి రూ.3వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు మహేష్, గుగులోతు లక్ష్మణ్, పూర్ణచందర్, వెంకట్ రెడ్డి, సురేష్, సందీప్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్న కేంద్రం



మాట్లాడుతున్న శ్రీనివాస్

నెహ్రూసెంటర్: జాతీయ ఉపాధిహామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ అన్నారు. మండల పార్టీ నాయకుల సమావేశం చేపూరి గణేశ్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఉపాధిహామీ పనుల డిమాండ్‌ను తగ్గించి చూపుతూ నిధుల కేటాయింపులో కేంద్రం పక్షపాతం చూపుతుందన్నారు. ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసేందుకు కేంద్రం కుట్రలు చేస్తుందని దుయ్యబట్టారు. గ్రామీణ ప్రాంతాల్లోని వ్యవసాయ కూలీలకు ఉపాధిహామీ చట్టం ద్వారా పనిలేని రోజుల్లో పని దొరుకుతుందన్నారు. ఎన్నో దశాబ్దాల పోరాటాల ఫలితంగా వచ్చిన ఈ పథకాన్ని ప్రభుత్వం కావాలనే నిర్లక్ష్యం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు రాజన్న, మండల కార్యదర్శి రామ్మూర్తి, నాయకులు కుర్ర మహేష్, సురేష్, జోగ్యానాయక్, బాలు, బ్రహ్మం పాల్గొన్నారు.

‘భోగ్‌బండారో’ కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

కురవి: తండాల్లో ప్రతీ ఒక్కరి ఇంటి ఎదుట ఈనెల 15వ తేదీన భోగ్‌బండారో నిర్వహించాలని సేవాలాల్ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకన్న నాయక్ పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని బలపాల శివారు లింగ్యాతండా జీపీలో సర్పంచ్ గుగులోత్ రాంలాల్‌నాయక్ ఆధ్వర్యంలో డప్పు చాటింపు చేసి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించి కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు గుగులోత్ నందూలాల్, నాయకులు సాములునాయక్, నగేష్, లక్ష్మణ్, దేవేందర్, రందాస్, వెంకట్రామ్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

చండీహోమం

కేసముద్రం: మండలంలోని కోరుకొండపల్లి గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా శనివారం భక్తిశ్రద్ధలతో చండీహోమం, రుద్రహోమం పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం దేవుళ్ల విగ్రహాలపై భక్తులు ధాన్యం, బియ్యం పోస్తూ, పూజలు నిర్వహించారు.

కేసీఆర్ కిట్ అందజేత

మరిపెడ: మరిపెడ మున్సిపాలిటీలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎల్లారిగూడెం గ్రామానికి చెందిన నునావత్ అనూషకు డాక్టర్ గుగులోతు రవి శనివారం రెండో కాన్పు సుఖప్రసవం చేయగా ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. ఈసందర్భంగా బాలింతరాలు అనూషకు కేసీఆర్ కిట్‌ను డాక్టర్ రవి అందజేశాడు.

సరుకుల పంపిణీ

కురవి: మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో ఉన్న దివ్యాంగులకు సర్వెంట్స్ ఆఫ్ చారిటీ అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులను శనివారం పంపిణీ చేశారు. ఒక్కో దివ్యాంగుడికి 10కేజీల బియ్యం, మంచి నూనె ప్యాకెట్ అందజేశారు. కార్యక్రమంలో సంస్థ కోఆర్డినేటర్ ఫాదర్ పాల్‌రాజ్, దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా కార్యదర్శి సయ్యద్ ఖాజా, టీఆర్‌ఎస్వీ రాష్ట్ర కన్వీనర్ గుండు రవి, తదితరులు పాల్గొన్నారు.

16న వేలంపాట

నర్సింహులపేట: మండల కేంద్రంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ సన్నిధిలో ఈనెల 16వ తేదీన తలనీలాలు, కొబ్బరికాయల వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఈఓ వేణుగోపాల్, చైర్మన్ రమేష్ శనివారం తెలిపారు. వేలంపాటలో పాల్గొనే వ్యక్తులు తలనీలాలకు రూ.లక్ష, కొబ్బరికాయలు, పూజా సామగ్రికి రూ.లక్ష డీడీ రూపంలో చెల్లించి వేలంలో పాల్గొనాలని తెలిపారు.

అక్రమ అరెస్ట్ అన్యాయం

కురవి: తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం రాష్ట్ర నాయకుడు కూతాడి శ్రీనివాస్‌ను అక్రమంగా అరెస్టు చేయడం అన్యాయమని తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షుడు పేరం వీరస్వామి అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. ఆయనను విడుదల చేయకుంటే ఆందోళన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లయ్య, ఎల్లేష్, నాగన్న, వీరభద్రం, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

‘హాకా’ చైర్మన్‌ను కలిసిన భరత్‌కుమార్

మరిపెడ రూరల్: హైదరాబాద్ అగ్రికల్చర్ కోఆపరేటివ్ అసోసియేషన్ లిమిటెడ్ (హాకా) చైర్మన్ మచ్చ శ్రీనివాస్‌ను హైదరాబాద్‌లోని హాకా కార్యాలయంలో జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ యువ నాయకుడు తేజావత్ భరత్‌కుమార్ మర్యాదపూర్వకంగా శనివారం కలిశారు.

పరామర్శ..

కేసముద్రం: మండలంలోని ఉప్పరపల్లి గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్టు, టీయూ డబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుల యుగేందర్ తండ్రి ఆవుల మల్లయ్య(61) శుక్రవారం గుండెపోటుతో మృతిచెందాడు. ఈమేరకు శనివారం మృతుడి కుటుంబాన్ని, జిల్లా అధ్యక్షుడు చిత్తనూరి శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర కౌన్సిల్‌మెంబర్ బండి సంపత్‌కుమార్, హెచ్143 జిల్లా ప్రధాన కార్యదర్శి గుట్టయ్య బాధిత కుటుంబాన్ని పరామర్శించి, మృతదేహంపై పూలమాల వేసి సంతాపం తెలిపారు.

అత్యాచారయత్నం

నెల్లికుదురు: ఓమహిళపై అత్యాచారయత్నానికి పాల్పడిన సంఘటన మండలంలోని బ్రాహ్మణకొత్తపల్లి గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శనివారం తొర్రూరు సీఐ సత్యనారాయణ, ఎస్సై పత్తిపాక జితేందర్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ఓ మహిళ ఈనెల 9న రాత్రి సమయంలో గ్రామానికి చెందిన బెజ్జం పక్కీరు ఇంట్లో టీవీ చూసి తన ఇంటికి వెళ్తున్న క్రమంలో అదే గ్రామానికి బెజ్జ చెందిన కారం లక్ష్మయ్య, బెజ్జం ఉమేష్‌లు ఒంటరిగా వస్తున్న మహిళను పక్కనున్న బెజ్జం వెంకన్న ఎడ్ల కొట్టంలోకి బలవంతంగా తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడినట్లు బాధితురాలు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు ఇద్దరుపై అత్యాచారయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సత్యానారాయణ, ఎస్సై జితేందర్ తెలిపారు.


కుక్క దాడిలో చిన్నారికి గాయాలు



కురవి: సీరోలు మండలం తాళ్లసంకీస గ్రామంలో ఆడుకుంటున్న ఆరేళ్ల చిన్నారిని వీధికుక్క దాడికి పాల్పడి తీవ్రంగా కరిచి గాయపర్చిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పదిల ఆంజనేయులు కుమార్తె శ్రీజ తోటి పిల్లలతో కలిసి ఆడుకుంటుంది. ఈ క్రమంలో కుక్క శ్రీజపై పడి తీవ్రంగా కరవటంతో తలకు బలమైన గాయాలయ్యాయి. తండ్రి వెంటనే కుక్కను తరిమి బిడ్డను కాపాడాడు. చిన్నారిని ఆస్పత్రికి తీసుకెళ్లారు. గాయపర్చిన కుక్కను స్థానికులు చంపేశారు.

పేదలకు చేరని ‘డబుల్’ ఇళ్లు

- శిథిలమవుతున్న తలుపులు, కిటికీలు
- పశువుల పాకలుగా మారిన వైనం



శిథిలమవుతున్న తలుపులు, మెట్లు



పశువుల పాకలుగా మారిన డబుల్ ఇళ్లు



వెన్నారం గ్రామంలో పూర్తయిన డబుల్ బెడ్రూం ఇళ్లు

డోర్నకల్: మండలంలోని వెన్నారం గ్రామంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లు పేదలకు పంపిణీ చేయకపోవడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. 2018లో నిర్మాణ పనులు పూర్తియిన 18 ఇళ్లను నేటికీ లబ్ధిదారులకు పంపిణీ చేయలేదు. అదే సంవత్సరం మరో 52 ఇళ్ల నిర్మాణం చేపట్టినా వాటి నిర్మాణ పనులు నేటికీ పూర్తి కాలేదు. వివిధ నిర్మాణ దశలలో ఉన్న 52 ఇళ్లకు సంబంధించి సుమారు ఐదు సంవత్సరాల తరువాత 32నిర్మాణ పనులు ఇటీవల ప్రారంభమయ్యాయి. నిర్మాణం పూర్తయిన 18ఇళ్లను నేటికి లబ్ధిదారులకు పంపిణీ చేయకపోవడంతో ఇళ్లు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. తలుపులు, కిటికీలు శిథిలమవుతున్నాయి. ఇళ్లకు అమర్చిన విద్యుత్ వైర్లు, మీటర్లు కూడా ధ్వంసమయ్యాయి. కొన్ని ఇళ్లకు తాళాలు వేయకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తులు ఇళ్లలోకి ప్రవేశించి మద్యం సేవించి పేకాడుతున్నట్లు అక్కడి పరిస్థితులను పరిశీలిస్తే అర్థమవుతోంది. చాలా రోజులుగా నిర్మాణం అసంపూర్ణంగా ఉండడంతో డబుల్ ఇళ్లలో చుట్టూ ప్రక్కల ప్రాంతాలకు చెందిన వారు పశువులను ఇళ్లలో కట్టేస్తుండటంతో ఇళ్లు పశువుల పాకలుగా మారాయి. ఇసుక కొరత, కాంట్రాక్టర్‌కు బిల్లులు సక్రమంగా అందకపోవడంతో నిర్మాణ పనుల్లో జాప్యం జరిగిందని సంబంధిత కాంట్రాక్టర్ చెబుతున్నాడు. అధికారులు స్పందించి నిర్మాణం పూర్తయిన 18 ఇళ్లను అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేయాలని స్థానికులు కోరుతున్నారు.

అర్హులకు పంపిణీ చేస్తాం..



గ్రామంలో ఇప్పటికే డబుల్ బెడ్రూం ఇళ్లు లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేశారు. ఎమ్మెల్యే రెడ్యానాయక్‌కు పరిస్థితిని వివరించి నిర్మాణం పూర్తయిన ఇళ్లకు అర్హులైన లబ్ధిదారులకు ప్రాధాన్యతా క్రమంలో పంపిణీ చేస్తాం.

\- బోయినపల్లి వెంకన్న, సర్పంచ్, వెన్నారం

పాదయాత్ర వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



కురవి: గ్రామ పంచాయతీల్లో పనిచేసే కార్మికుల సమస్యలను తీర్చాలని సీఐటీయూ అనుబంధ గ్రామ పంచాయతీ ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బల్ల అప్పిరెడ్డి, సీఐటీయూ మండల కన్వీనర్ పోతుగంటి మల్లయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలో సంఘం ఆధ్వర్యంలో నేడు(ఆదివారం) పాలకుర్తి నుంచి హైదరాబాద్ వరకు తలపెట్టిన కార్మికుల పాదయాత్ర వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు షేక్ మంజూర్‌అలీ, వెంకన్న, నాగభూషణం, వెంకన్న, కృష్ణ, దేవి, యుగేందర్, తదితరులు పాల్గొన్నారు.